# పక్కలో ముల్లు

ఆంజనేలు రెండు తప్పులు చేశాడు ! ....

మొదటిది దమయంతిని పెళ్ళి చేసుకోవటం.

రెండవది ఆమెచేత ఉద్యోగం చేయించటం ! !....

*   *   *

దమయంతి చాలా అందంగా వుంటుంది. మంచు తెరలమధ్య కనిపించే సెలయేరుకంటే-వెన్నెల కాంతిలో ఉవ్వెత్తున వీచే సముద్ర కెరటంకంటే-మండు వేసవికి మంగళహారతి పడుతూ కురిసే తొలకరి వానకంటే, వెయ్యిరెట్లు బావుంటుంది దమయంతి.

అందుకే_

పెళ్ళిచూపులయిన నెలరోజుల్లోనే - ముహూర్తంకోసం తొందర పెట్టి నయాపైస కట్నం కోరకుండా పెళ్ళి చేసేసుకున్నాడు ఆంజనేలు. పెళ్లి చేసుకున్నాక-హనీమూన్ పేరుతో దమయంతిని పెద్ద తిరుపతి తీసుకెళ్లినప్పుడు, రైలంతా ఖాళీగా వున్నాసరే, తనూ దమయంతీ ఎక్కిన కంపార్టుమెంటులోనే ప్రయాణీకులు కిక్కిరిసిపోయారు.

తిరుపతి కొండమీద వెంకటేశ్వరస్వామి దర్శనంకోసం క్యూలో నిలబడి నడుస్తున్నంతసేపూ - వెనుక నిలబడిన జనమంతా ముందుకు తోసుకు రావాలని ప్రయత్నించారు!

గర్భగుడిలో బోలెడంతమంది భక్తులు - ఆ స్వామిని చూడటం కూడా మానేసి కన్నార్పకుండా వెర్రిమొహాలు వేసుకుని - దమయంతినే చూస్తుంటే తాను దమయంతికి భర్తయినందుకు, ఆంజనేలుకి గర్వం కలిగినా కొంచెం చిరాకనిపించిందికూడా.

పెళ్ళిచేసుకుని, హైదరాబాదులో కాపురంపెట్టిన అయిదారునెలల తర్వాత ఓ రోజు పొద్దున్నే ప్రాంతీయ వార్తలు వింటున్న ఆంజనేలుకి కాఫీ కప్పు అందిస్తూ అడిగింది దమయంతి_

"ఏవండీ!... నేనుకూడా ఉద్యోగం చేస్తానండీ!"- అని....

ఆంజనేలు వెంటనే ఏమీ బదులు చెప్పలేదు...

'బిఏ పాసయ్యాను! ఖాళీగా కూర్చోవటం ఎందుకు చెప్పండి!.. ఏదైనా ఉద్యోగంలో చేరితే వేణ్ణీళ్ళకు చన్నీళ్ళ సాయంలా మరో అయిదారు వందలు తెచ్చుకోవచ్చు... మన కాలనీలో ఎంతోమంది ఆడవాళ్ళు ఉద్యోగాలు చేస్తున్నారు.... పైగా మీరు ఆఫీసుకి వెళ్ళిపోయాక ఒక్క_

త్తినీ వుండాలంటే బోర్ కొడుతోంది। ' తనకు ఉద్యోగం చేయాలనే ఉద్దేశ్యం ఎందుకు కలిగిందో విడమరచి చెప్పింది.... ఆంజనేలుకికూడా ఆమె ఆలోచన నచ్చింది....తను పనిచేస్తున్న ఆఫీసులో వాసంతి, సువర్చల, పారిజాతం, వసంతలక్షి, వెంకటమ్మ—ఇలా ఎంతమంది ఆడవాళ్ళు పనిచేయటంలేదూ ?.... అలాంటప్పుడు దమయంతి చేస్తే మాత్రం తప్పేముంటుంది ?....

పైగా ఆమె ఉద్యోగంలో చేరితే, చదువుకుని తెచ్చుకున్న డిగ్రీకి సార్థకత చేకూరుతుంది... ఇప్పుడు తాను తెస్తున్న జీతం తమ కుటుంబానికి సరిపోతున్నా—ముందుముందు పిల్లా పీచూ పుట్టుకొస్తే కష్టంకదా? దమయంతి కూడా ఉద్యోగంలో చేరితే ఎంచక్కా వాయిదాల పద్ధతిలో ఓ ఫ్రిజ్జూ, ఓ స్కూటరూ, ఓ కలర్ టీవీ - ఇత్యాదులన్నీ కొనుక్కుని ఆమె తెచ్చే జీతాన్ని నెలనెలా కట్టేస్తూ వుండచ్చు....

కానీ దమయంతి చేస్తానంటున్నది ఉద్యోగం!... అప్పడాలూ, విస్తరాకులూ తయారుచేయటం కాదు....

'ఈ రోజుల్లో ఉద్యోగం దొరకటం అంత సులువా ?'-

కాఫీ తాగుతున్నంతసేపూ ఆలోచించి తాగింతరువాత ఖాళీకప్పు భార్యకు ఇచ్చేస్తూ, అదే అనుమానాన్ని వ్యక్తం చేశాడు ఆంజనేలు.

"ప్రయత్నిద్దాం!.... దొరికినప్పుడే దొరుకుతుంది!" చెప్పింది దమయంతి.

'ఓకే!- నీ ఇష్టం!- అన్నాడు ఆంజనేలు.

ఆ తర్వాత మూడు రోజులకే ఓ ప్రియివేట్ కంపెనీలో 'రిసెప్షన్-కం-టెలిఫోన్ ఆపరేటర్' ఉద్యోగానికి అందం ఆకర్షణా లిగిన అమ్మాయిలు కావాలని దినపత్రికలో వచ్చిన ప్రకటన చూసి-తన ఫొటో జతపరుస్తూ దరఖాస్తు పెట్టుకుంది దమయంతి.

అలా, దరఖాస్తు పంపుకున్న నాలుగురోజులకే 'కాల్‌లెటర్' వచ్చింది... నాలుగురోజుల్లో ఇంటర్వ్యూకి హాజరు కావాలి!...

ఉద్యోగం వచ్చేసినట్టే ఎగిరి గంతేసింది దమయంతి.... సాయంత్రం భర్త ఆఫీసునించి రాగానే మురిసిపోతూ విషయం చెప్పింది

'అంత మురిసిపోకు! రికమండేషన్లూ లంచాలూ లేనిదే ఉద్యోగాలు రావు! అందులోనూ అది ప్రయివేటు కంపెనీకూడా!'- అన్నాడు ఆంజనేలు. ఆ మాటవిన్న దమయంతి నిరాశపడలేదు.... నిస్పృహ చెందలేదు...

'పెళ్ళి చూపుల్లో నన్ను చూడగానే- మీకు నేను నచ్చానా లేదా? గర్వంగా నవ్వుతూ అడిగింది.

'నచ్చితే?'

రేపు ఇంటర్వ్యూలోకూడా వాళ్ళకు నేను నచ్చితీరుతాను. వాళ్ళకు అందం ఆకర్షణా కావాలన్నారు. ఆ రెండూ నాలో వున్నాయి..." దృఢంగా చెప్పిందామె.

ఆ మాటలు వింటున్న ఆంజనేలు, తెలుగుసినీమాలో 'డబల్ మీనింగ్' డైలాగు విన్నట్టు ఉలిక్కి పడ్డాడు.

''పెళ్ళి చూపులకీ-ఉద్యోగం ఇంటర్వ్యూకీ చాలా డిఫరెన్సు వుంటుందిలే!'- అన్నాడు ఇంకేం చెప్పాలో తోచక.

అయినా నిరుత్సాహపడలేదు దమయంతి.

మర్నాడు పొద్దున్నె-రెండు జనరల్ నాలెడ్జి పుస్తకాలు తెప్పించి ఆ చివర్నించి ఈ చివరివరకూ చదివేసింది.... ఒరిజినల్ సర్టిఫికెట్లన్నీ

అందమైన ఫైలులో పెట్టుకుని-ఇంకా అందమైన చీర కట్టుకుని-నాలుగో రోజు ఉదయం పదిగంటలకు ఇంటర్వ్యూ అయితే-పావుగంటముందు ఆ కంపెనీకి చేరుకుంది....అప్పటికి వేరే కేండిడేట్లు ఎవరూ రాలేదు....

'అసలు ఎన్ని పోస్టులున్నాయో, ఎంతమందిని పిలిచారో, ఇంటర్వ్యూలో ఏ వేం అడుగుతారో, సెలక్టయితే జీతం ఎంతఇస్తారో?'-ఆలోచిస్తూ కూర్చుంది దమయంతి.

క్షణాలు...నిముషాలు... గడిచిపోతున్నాయి. ఆఫీసులో ఉద్యోగులు ఒక్కొక్కరే వస్తున్నారు....

పదిగంటలు కావటానికి ఇంకా కొన్ని క్షణాలేవుంది.

అప్పటికీ వేరే అభ్యర్ధులు ఎవ్వరూ రాలేదు....

'అసలు ఇంటర్వ్యూ ఆరోజేనా ? లేక తాను పొరపాటుపడిందా' అ అనుమానంకూడా వచ్చింది.... చటుక్కున చేతిలోవున్న ఫైలు తెరచి 'కాల్ లెటర్'ను మరోసారి చూసుకుంది...

అనుమానంలేదు .. ఇంటర్వ్యూ ఆరోజే!...

మళ్లీ రిస్ట్‌వాచ్ చూసుకుంది....

సరిగ్గా పది !...

''మీరు ఇంటర్వ్యూకి వచ్చారా మేడం ?'- ఆదేక్షణంలో ఆఫీసు ప్యూను ఆమెకు దగ్గరగా వచ్చి అడిగాడు.

అవునని కళ్ళతోనే సమాధానం చెప్పింది దమయంతి.

'లోపలకు వెళ్ళండి!'- మేనేజర్ గదివైపు దారి చూపించాడు ప్యూన్. నెమ్మదిగా ఆ గదిలోకి నడిచింది దమయంతి....

లోపలకు అడుగు పెట్టగానే-ఆ గదిలో కూర్చున్న నలుగురి చూపులూ ఒక్కసారిగా ఆమెమీదకు దాడిచేశాయి...

'ప్లీజ్ టేక్ యువర్‌సీట్!'- అన్నాడొకాయన.

థాంక్స్ చెప్పి కూర్చుంది దమయంతి.

'ఉద్యోగంలో చేరటానికి ఎన్నిరోజులు టైం కావాలీ?'- మేనేజర్ అడిగాడు. ఆ ప్రశ్న వినగానే-ఉద్యోగం తనకు వచ్చేసిందన్న ఊహ కలిగిందామెకు, దాంతోబాటు బోలెడు ధైర్యంకూడా కలిగింది... తన సర్టిఫికెట్లు వాళ్ళకు చూపించాలని, తనచేతిలోని ఫైలు తెరవబోయింది...

'మీ సర్టిఫికెట్ కాపీలన్నీ చూశాం! అన్నింటినీమించి మీఫోటో చూడగానే మీరు చాలా అందంగా వున్నారని అనుకున్నాం!... అందుకే వేరెవర్నీ ఇంటర్వ్యూకి పిలవలేదు... ఫొటోలోకంటే మీరు వెయ్యిరెట్లు బావున్నారు.... "ఎక్స్‌పెక్ట్" చేసిన అందం, ఆకర్షణా మీలో వున్నాయి... అందువల్ల మీరు రేపే ఉద్యోగంలో జాయిన్ కావచ్చు!'- చెప్పాడు మేనేజరు.

థాంక్స్ చెప్పింది దమయంతి.

'బైదీబై జీతం ఎంత 'ఎక్స్‌పెక్ట్' చేస్తున్నారు?'- అడిగాడుమళ్ళీ.

ఆరువందలిస్తేచాలని చెప్పాలనుకుంది... కాని ఆమెకు ఆ అవకాశం ఇవ్వకుండా మళ్ళీ మేనేజరే చెప్పేశాడు-

'ప్రస్తుతం పెన్నెండు వందలిస్తాం!... ఓ ఏడాది ప్రొబేషను!... ఆ తర్వాత పదిహేనువందలొస్తుంది... బోనస్‌వంటి సదుపాయాలు కూడా లభిస్తాయి!'–

మేనేజరు అలా గబగబా చెప్పుకుపోతూంటే దమయంతి ఆనందంతో ఉక్కిరి బిక్కిరైపోయింది.

'ఆల్‌రైట్!... బైట కాసేపు వెయిట్ చేయండి! ఆర్డర్స్ తీసుకుని వెడుదురుగాని!'– అన్నాడాయన క్షణం తర్వాత....

దమయంతి కుర్చీలోంచి లేచి, ఆయనకు నమస్కరించి వెను తిరగ బోతోంటే 'ఫరవాలేదు.... ఇక్కడే వెయిట్ చేయచ్చు... కూర్చోండి!– అన్నాడు అక్కడున్న నలుగురిలో ఓ పెద్దమనిషి.

దమయంతి గర్వంగా కూర్చుంది.

'చూడండి మేడం!... మీరు సినీమాల్లో యాక్ట్‌చేశారా?... అడిగాడాయన. లేదన్నట్టు తల అడ్డంగా తిప్పింది.

'సినిమాల్లో యాక్ట్ చేసినవారికే ఉద్యోగం ఇస్తారా?'... అనుమానంగా అడిగింది.

'నో.. అలాక్కాదు.... మీరు చాలా బ్యూటిఫుల్‌గా వున్నారు... బహుశా యాక్ట్ చేసివుంటారనుకున్నా!'

ఆయనవైపు కృతజ్ఞతా పూర్వకంగా చూసి బయటకొచ్చి, బల్ల మీద కూర్చుంది.... తర్వాత అరగంటకే ఆమె చేతికి ఆర్డర్స్ అందాయి. ఆ కవరు తీసుకుని తిన్నగా ఆబిడ్స్ వెళ్ళి– అక్కడ ఓ అరకిలో స్వీట్లు కొని యింటికి చేరుకుంది....

సాయంత్రం ఆఫీసునించి యింటికి తిరిగివచ్చిన ఆంజనేలుకి స్వీటు అందించి అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ చూపించింది....

'నేను చెప్పానా ?.... ఈ ఉద్యోగం నాకే వస్తుందని ?'— గర్వంగా అందామె. ఆంజనేలుకి అంతా అయోమయంగా వుంది...

నాలుగేళ్ళ క్రితం ఉద్యోగం కోసం తాను పడిన పాట్లన్నీ— ఒక్క సారిగా అతని స్మృతి పథంలో మెదిలాయి...

తాను బీకాం పాసయ్యాడు. టైపూ షార్టుహ్యాండూ పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యాడు. కనీసం పాతిక ముప్ఫయ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూ వస్తే వందకువంధలు ఖర్చుపెట్టి హాజరయ్యాడు.... ఆఖరికి సర్వీస్ కమీషన్ పరీక్షలో పాసై గుమాస్తా ఉద్యోగం సంపాదించుకున్నాడు.

అలాంటిది—

ఇప్పుడు దమయంతి ఉద్యోగంలో చేరాలనుకున్న వారంరోజుల్లో బంగారంలాంటి ఉద్యోగం సంపాదించుకుంది !....

కారణం ఏమిటి ? !

'వాళ్ళంతా నన్నూ నా అందాన్నీ చూసి మూర్ఛ పోయారంటే నమ్మండి !.... అసలు అప్లికేషన్‌తో పంపిన నా ఫొటో చూసే— పడి పోయాట్ట ఆ మేనేజరు... అందుకే ఇంటర్వ్యూకి మరెవర్నీ పిలవకుండా నన్నొక్కత్తినే పిలిచారట !.... పైగా 'సినీమాల్లో యాక్ట్ చేశారా'— అని కూడా అడిగారు తెలుసా ?'—

ఆ రాత్రి పడగ్గదిలో ఆంజనేలుకి పాలగ్లాసు అందిస్తూ చెప్పింది దమయంతి. పాలు చేదుగా అనిపించాయి ఆంజనేలుకి!

* * *

'మా ఆఫీసులో శేఖరం లేడూ?... ఆదేనండీ... శోభన్‌బాబులా వుంటాడని చెప్పానూ— అతను!.... అతనేమన్నాడో తెలుసా ఇవాళ?' డైనింగ్ టేబులు దగ్గర కూర్చున్న ఆంజనేలుకి ఆవకాయ అన్నంలో వెన్నపూస వేస్తూ అడిగింది దమయంతి.

'ఏమన్నాడేమిటి?'

'ఇవాళ ఆ పైలట్ శారీ కట్టుకు వెళ్ళానుకదూ! అది చూసి చాలా బాగుందని మా కొలీగ్ పద్మిని మెచ్చుకుంటూంటే— పక్కనే వున్న శేఖరం అది విని— 'కొంతమందికి వాళ్ళు కట్టుకున్న చీరవల్ల అందంవస్తుంది.... అసలు శాపవశాన ఏమేనకో, ఊర్వశో ఇలా భూలోకంలో దమయంతిగా పుట్టివుండాలి' — అన్నాడు' గర్వంగా చెప్పింది.

ఆంజనేలు మాట్లాడలేదు... గబగబా భోజనం ముగించి లేచి పోయాడు. వంటగదిలో పనులన్నీ పూర్తి చేసుకుని పడక గదికి చేరుకున్న దమయంతి తమలపాకులకు సున్నంరాస్తూ మంచంమీద పడుకున్న భర్తని అడిగింది—

'వచ్చే సోమవారం బంజారాలో 'మేడ్ ఫర్ ఈచదర్' పోటీ వుందట!... వెడదామా?'— అని.

'మనవా?'

'ఏంమనకేం?... నేనెంత అందంగా వున్నానో మీకు తెలుసుగా... సెలక్టయిన జంటని వాళ్ళ ఖర్చులతో సింగపూర్ పంపిస్తారట ఎంచక్కా!.... ఎలాగా నాలుగు రోజులు టైముందికూడానూ!... ఈ నాలుగు రోజులూ మీరుకాస్త ముఖానికి సెనగపిండీ పసుపూ నలుగు పెట్టుకుని— క్రీం రాసుకుంటే అప్పటికి 'ఎట్రాక్టివ్'గా తయారవుతారు!'

'ఇప్పుడు యట్రాక్టివ్‌గా లేనా?'— టక్కున అడిగాడు అంజనేలు.

'ఛ!... అలా అనికాదు... వెళ్ళేది పోటీకికదా! మరింత అందంగా కనిపిస్తారనీ!'— కిళ్ళీ అందిస్తూ చెప్పింది దమయంతి.

కిళ్ళీ వెగటుగా అనిపించింది ఆంజనేలుకి!

* * *

'ఇవాళ మీకో సర్‌ప్రైజ్!'— పట్టెమంచం మీద పడుకొని వార పత్రిక చూస్తున్న భర్త పక్కకు చేరి దమయంతి చెప్పింది.

'ఏమిటో అది?'— పత్రికలోంచి చూపు మరల్చకుండానే అడిగాడు ఆంజనేలు.

'ముందు మీకు జీతం ఎంత వస్తుందో చెప్పండి!'

ఆ ప్రశ్న ఎందుకు అడిగిందో అర్థంకాక అయోమయంగా చూశాడు.

'పదిహేనువందలు వస్తోందా?'— మళ్ళీ దమయంతే అడిగింది.

'జీతం పదిహేనుదాటినా చేతికొచ్చేది పదకొండే!'— చెప్పాడు.

మీకు పదకొండు!... నాకు పదిహేను!.... మొత్తం ఇరవై అరువందలు.... అవునా?'

'అయితే ఏమిటీ?'

'మీరు ఉద్యోగం మానేస్తే ఏమవుతుంది?'

ఆ ప్రశ్నవిని ఆంజనేలు త్రుళ్ళిపడ్డాడు.

'ఉద్యోగం మానేయటమా?.... ఎందుకూ?...' ఖంగారుగా అడిగాడు.

'కలకత్తా వెళ్ళిపోదాం!... ఈపాటి ఉద్యోగం మీకు అక్కడ దొరక్కపోదు!'

'ఏమిటి నువ్ చెప్పేది!'— చిరాగ్గా అడిగాడు ఆంజనేలు.

'ఇవాళ కలకత్తానించి బుల్‌చంద్ కంపెనీ ప్రొప్రయిటర్ సుభాష్ ముఖర్జీ మా ఆఫీసుకి ఏదోపనిమీద వచ్చాడు.... నేను రిసెప్షన్‌లోనే వున్నానుగా.... నన్నుచూసి మూర్ఛపోయాడంటే నమ్మండి!... యూ ఆర్ బ్యూటిఫుల్' అంటూ కాంప్లిమెంట్ చేశాడు... ఆ తర్వాత మా మేనేజర్‌తో మాట్లాడి వెళ్ళిపోతూ మళ్ళీ నా దగ్గరకు వచ్చాడు. పేరడిగాడు.... చెప్పాను.... 'జీతం ఎంత వస్తోందీ' అని అడిగాడు.... చెప్పాను.... వాళ్ళ కంపెనీలో పర్సనల్ సెక్రటరీగా చేరితే మూడు వేల జీతం ఇస్తానన్నాడు....

ఆశ్చర్యపోయానంటే నమ్మండి!'— ఉత్సాహంగా చెప్పింది.

'ఇంతకీ వాడికేం చెప్పావ్?'— సీరియస్‌గా అడిగాడు ఆంజనేలు

'మిమ్మల్ని అడిగి చెప్తానన్నాను.... అన్నట్టు మిమ్మల్ని కూడా ఆయన మెచ్చుకున్నాడు తెలుసా ?'–

తన ముఖమైనా చూడని ఆ ముఖర్జీ ఎవడో– తనను పనిగట్టుకుని ఎందుకు మెచ్చుకున్నాడో ఆంజనేలుకి అర్థంకాలేదు.

'నాలాంటి అందమైన భార్య దొరకటం మీ అదృష్టమట!'– గర్వంగా చెప్పింది దమయంతి.

ఆంజనేలు మరేం మాట్లాడలేదు.... పడుకున్నది పరుపు మీదే అయినా ముళ్ళు గుచ్చుకుంట్టున్నటు బాధపడ్డాడు. ఆ గుచ్చుకుంటు న్నది గుండెలకో, శరీరానికో తెలియని పరిస్థితి.

రెండు నిమిషాల తర్వాత దమయంతి మళ్ళీ అడిగింది–

'ఇంతకీ నన్నేం చేయమంటారు ?'

'వెంటనే నీ జాబ్ కి రాజీనామా ఇచ్చేయ్ !'– దృఢంగా అన్నాడు ఆంజనేలు.

'అంటే... మనం కలకత్తా వెళ్ళిపోదామా ?'– ఉత్సాహంతో ఆ పరుపు మీదనే ఎగిరి గంతేసింది దమయంతి.

'కాదు.... ఇక్కడే వుంటాం!... ఇక నువ్వు ఉద్యోగమే చెయ్యొద్దు... ఇంట్లోపడుండు!'– అన్నాడు ఆంజనేలు మంచం దిగి పోయి తలగడని కింద వేసుకుని పడుకుంటూ !!

— మయూరి